ఆకాశవాణి విజయవాడ కేంద్రం-వనిత వాణిలో ప్రసారమైన రేడియో కథ :

రచన: శ్రీమతి వలివేటి నాగచంద్రావతి: తేదీ: 19-3-2021

# ధరణి

మార్కెట్ దగ్గర సిటీబస్ ఆగింది. వెనక వైపు డోర్ నించీ దిగుతూ చూశాను - ముందు వైపు నించీ బస్సెక్కుతున్న ఆమెను.

ఎవరావిడ? తెలిసినట్టుగా వుందే. బుర్రలో పాత జ్ఞాపకాలు పొరలని గబ గబా తిరగేసాను. వయసు మూలంగా కళ తగ్గినా ఆ పెద్ద కళ్ళు. కొద్దిగా నెరిసినా అందంగా వున్న నొక్కుల జుట్టు ..... తను నాచిన్ననాటి నెచ్చెలి ధరణి కాదూ –

ఔను తను ధరణే. సందేహం లేదు. సంభ్రమంగా కేక వేయబోయాను. బస్సు కదిలి పోయింది. 'అయ్యయ్యో మిస్ చేసుకున్నానే.' నిజంగా చాల బాధనిపించింది. మళ్లీ తననెలా కలవగలను అని.

ఇక మార్కెట్‌లో వేస్తున్న ప్రతి అడుగులోనూ ధరణి జ్ఞాపకాల మననమే.

నాకప్పుడు పన్నెండెళ్ళుంటయ్. మా ఇంటి పక్కఇల్లే వాళ్లది. ఆ కాలనీకి మేము వెళ్లిన రెండోరోజే మా అమ్మ నన్ను పక్క ఇంటికి తీసుకువెళ్లింది.

"మీ పాప చదివే స్కూల్లోనే మా చంద్రకళనీ చేరిపించాం. ఇద్దరిదీ ఒకే క్లాసు. మా పిల్లకి కాస్త భయమెక్కువ. వీళ్లిద్దరికీ పరిచయం చేస్తే రేపటినిచ్చి స్కూలుకి వెడతారని తీసుకు వచ్చాను వదిన గారూ." అని వరసకలిపింది.

మా మాటలు విని గాబోలు లోపల నుండి పరిగెత్తుకుంటూ వచ్చింది నా వయ్యసే వున్నా ఓ అమ్మాయి . అదే మొదటిసారిగా ధరణిని చూడ్డం. మెరగ్గా వున్న కళ్ళు, నా కిష్టమైన నొక్కుల జుట్టు. మంచి ఛాయలో పొత్తరి గా వున్న తనను చూడగానే బాగా నచ్చేసింది నాకు.

నాకేసి చూస్తూ కలుపుగోలుగా నవ్వింది ధరణి. రెండడుగులు ముందుకేసి నా చెయ్యి పట్టుకుంది. "అలాగే ఆంటీ. మీరేం వర్రీ అవకండి. రేపట్నుంచీ నే తీసుకు వెడతాగా!" అన్నది ఆరింద లాగ.

కొత్తవాళ్ళ ముందర నోరు మెదపటానికి జంకు నాకు. 'అమ్మో ఈ అమ్మయి కెంత చోరవో' అనుకున్నాను. ధరణికి అప్పుడే పెద్ద పీట వేసేసాను మనసులో.

ధరణి ప్రభావం చాలా వుండేది ఆరోజుల్లో. నన్నాకట్టుకున్న విశేషాలు చాలా వుండేవి తనలో. ముఖ్యముగా ఆ రూపం. చక్కదనం ఒక్కటే కాకుండా ఒడ్డూ, పొడుగు కొంచం వయసుకు మించినట్టుగా వుండి, ఎవరి చూపులనైనా అటు లాక్కునేది. నేనసలే పీలగా చామన ఛాయలో వుండేదాన్నేమో తన స్నేహితురాలు హోదాలో పక్కన నడవటం కూడా గొప్పగా వుండేది నాకు.

ధరణికి నాయకత్వ లక్షణాలు కూడా ఎక్కువే. మాట్లాడటానికి వచ్చినా, పోరాడాలిసి వచ్చినా దేనికి వెనక్కు తగ్గేది కాదు. చదువు లోనూ ఆటల్లోనూ కూడా ముందుండేది. మా క్లాస్ లీడర్ తనే.

తనకి ఎంత ధైర్యమంటే - ఏ విద్యార్థి కయినా ప్రిన్సిపాల్ గారంటే భయముంటుంది కదా. అలాంటిది నాదో సెక్షన్ తనదో సెక్షన్ అయిందని తనే స్వయంగా ఆయన రూంకి వెళ్లిపోయి రిక్వెస్ట్ చేసి మరీ తన సెక్షన్ కి నన్ను మార్పించింది. అదీ ధరణి అంటే.

ఆ ధీరురాలికి ఈ అర్భకురాలు శిష్యురాలు. అందుకు చాల గర్వంగా వుండేది నాకు. స్కూల్లోను ఇంటి దగ్గర కూడా ద్విపత్ర దళంలా అంటుకు తిరిగేదాన్ని తనతో. ధరణి కూడా నేనంటే అభిమానం గానే వుండేది. బహుశ నా ఆరాధనా భావం తెలిసి పోతూ వుండేదనుకుంటాను.

కాలేజీ చదువు ప్రారంభం మమ్మలి కొంత విడిదీసింది.

"నువ్వసలే పిరికి సన్నాసివి. మగపిల్లల ఆగడాలకి తట్టుకోలేవు." అన్నారు అమ్మా నాన్న. వాళ్ల నిర్ణయానికి తలవంచి కొంచెం దూరమైనా లేడీస్ కి ప్రత్యేకంగా వున్న కాలేజీలో చేరిపోయాను.

"వాళ్ళ మొహం. నన్ను చూసి వాళ్ళేదడవాలి." అనగల సాహసమున్న ధరణి కోఎడ్యుకేషన్ కాలేజీలో చేరిపోయింది.

కాలేజీలు వేరైతేనేం, ఇల్లు పక్క పక్కనేగా. అంచేత మా అనుబంధమేమి పలచబడలేదు. సాయంత్రాలు డాబా మీద చేరామంటే ఎన్ని కబుర్లో.

ఆకాశంలో విహరిస్తూనే ఆకారాలు మార్చే మేఘాలు గూడు చేరే తొందరలో గుంపులుగా ఏగిరి పోతున్న విహంగ సమూహాలు – దగ్గర్నించీ - మా ఎకనామిక్స్ మిస్ వేసుకునే దట్టమైన మేకప్పు, వాళ్ళ కెమిస్ట్రీ లెక్చరర్ బొజ్జ కిందకి జారిపోయే బెల్ట్ వరకు ఎన్నో, ఎన్నెన్నో ముచ్చట్లు దొర్లిపోయేవి.

అప్పటినించే - అంటే ఆ రోజులొచ్చాకే రాకుమారి చెలికత్తె లెవల్ నిచ్చి తనతో సమాన స్థాయి లోకి ప్రమోషన్ నొచ్చిన అనుభూతిలోకి వచ్చాన్నేను.

* * * * *

ఉన్నట్టుంది "కాలేజ్ మానేస్తున్నాన్నేను". అని అనౌన్స్ చేసింది ఆ అదురు నించి తేరుకోక ముందే ఇంకో జర్క్ - "పెళ్లి చేసుకుంటూన్నాను మా బావని." అని. వివరాల్లోకి వెడితే, "మా బావంటే నా కిష్టం. బావకి పెళ్లి చేసెయ్యాలని తెగ తొందర పడి పోతుంది మాఅత్త. నా చదువు పూర్తివ్వాలి అది ఇది అని కూర్చుంటే బావ నాకు దక్కకుండా పోతాడు. నాకు చదువు, గిడువు అక్కర్లేదు బావతో నా పెళ్లి చేసెయ్యండి అని చెప్పేశాను."తెగించినట్టు చెబుతోంది ధరణి. అబ్బ ఏం ధైర్యం." ఆశ్చర్యంగా,

అయోమయంగా మాటలు రానట్టుండి పోయాను. 'తను ఏం చేసినా అంతే అస్సలు వూహించలేం'

ఆ రోజు శనివారం. కాలేజీనించి మధ్యాహ్నమే ఇంటికి వచ్చేసాను. ధరణి వాళ్ళ అమ్మ ప్రభావతి గారు అమ్మ తో మాట్లాడుతూ ఉంది ఏడుపు గొంతుతో.

ధరణికంటె వాళ్ల మేన బావ పదిహేనేళ్లు పెద్దట. పెద్దగా చదువు కోనూ లేదు. గొప్ప ఉద్యోగస్థుడూ కాదు. మెడికల్ రిప్రజెంటేటివ్ అట. "నెత్తి మీద జుట్టు తప్ప ఆస్తి కూడా లేదు. వాడి అందానికి పడిపోయింది పిచ్చిబొంద. ఎంత చెప్పినా మొండి పట్టు పట్టుకు కూర్చుంది" మొత్తుకొంటోందావిడ. "ఒక్కగా నొక్క బిడ్డ. బాగా చదివించాలి, అందల మెక్కించాలి, అని కలలు గన్నాం. నీళ్ళు చల్లేస్తోంది మొండి పిల్ల." దిగులు పడుతొందావిడ.

స్నేహితరాలిని గదా నేను చెబితే నన్నా మనసు మార్చు కుంటుందేమోనని ఆవిడ ఆశ.

ఉహూ ఆ ఆశ నాకు లేదు. ధరణి ఒక నిర్ణయానికి వచ్చిందంటే పునరాలోచించుకునే ప్రసక్తే లేదు, నాకు తెలిసి.

నేననుకున్నాదే నిజం. "వాళ్ళకి తెలీదు బావలేకపోతే నేను లేనని. మిగతవన్నీ నాకు ముఖ్యం కాదనీ." అన్నది ధరణి పుస్తక భాషలో.

ఒక శుభ ముహూర్తంలో ధరణి పెళ్ళై పోయింది.

ఆర్నెల్ల పాటు ధరణి మోహం కనపడటం అపురూపమై పోయింది నాకు. నేలకో, రెణ్నెల్లకో పుట్టినింటికి కొచ్చినా, నాకు దర్శనమిచ్చేది కొన్ని క్షణాలే. మబ్బుల్లో మెరుపులా తళుక్కు మన్నా ఆపది నిముషాలూ 'మా బావ అలా అంటాడు. మా బావ ఇలా చేస్తాడు.' అంటూ ఎంత సేపు బావ స్మరణే.

నా గురించి, నా విద్య గురుంచి ఎదైనా చెప్ప బోయినా దాని ప్రాముఖ్యత అంతగా లేనట్టు పెదవి విరిచేసేది. అమ్మ ముసి ముసిగా నవ్వు కునేది. నాకు మండుకొచ్చేది. మెల్ల మెల్లగా మా ఇద్దరి మధ్యన ఎడమ పెరిగింది.

నేను డిగ్రీ పూర్తి చేసాను. పెళ్లి కుదరంగానే రీజైన్ చేసె ఒప్పందం మీద స్థానికంగా వున్న కంపెనీలో ఉద్యోగం సంపాదించుకున్నాను. రొటీన్ లో పడిపోయాను.

* * * * *

ఆ రోజు సాయంత్రం ఆఫీసు నించొచ్చి స్నానం చేసి రిలాక్స్ వు తున్నాను. టీ కప్పు నా కందిస్తూ చెప్పిందమ్మా. "తిక్క పిల్ల. ఆ ధరణి మొగున్నోదిలేసి వచ్చేసిందట" అని.

నిజంగా షాక్ నాకు. మనస్సాగలేదు. ధరణి దగ్గరకు వెళ్ళాను వెంటనే. నా దృష్టిలో పిడుగొచ్చి మీద పడుతున్న జంకని ధీరురాలు ధరణి. నా ఒళ్ళో తల పెట్టి వల వల ఏడుస్తుంటే కరిగి నీరయి పోయాను .

భర్త ఎవరితోనో సంబందం పెట్టుకున్నాడట. దాచాలని చాలా ప్రయత్నం చేశాట్ట. పట్టు బడి పోయి ఒప్పేసుకున్నాట్ట.

"నన్ను గాక వేరొకర్ని తాకిన వాడితో నేనెలా సంసారం చేస్తాను?" అన్నది చివరికి. కళ్ల నిండా నీళ్లున్న కంఠంలో పూర్వపు ధరణి పౌరుషం అగుపడి సంతోషం కలిగింది నాకు."అవును పాపం. ఎంత ప్రేమించింది. ఎంత త్యాగం చేసి పెళ్లి చేసుకుంది అతణ్ణి. అంత ద్రోహం చేస్తాడా?" పోపొమ్మని తోసి వచ్చెయ్యటం సబబే అనిపించింది నాకు.

"మంచి పని చేసావ్." అన్నాను మనస్ఫూర్తి గా.

ఇది జరిగి వారం తిరగలేదు. ఓ రోజు ఉదయాన్నే కొత్త చీర కట్టుకుని, తల్లో పూలు, కళ్లకి కాటుక పెట్టుకుని మా ఇంటికి వచ్చింది ధరణి. పది గంటల బండికి అత్తారింటికి వెడుతోందట.

తెల్ల బోయాను. "బుధ్ధుందా దీనికీ?" చెయ్యి పట్టుకుని డాబా మీదికి లాక్కు పోయాను.

ఎటో చూస్తూ, కాస్త మొహమాట పడుతూ చెప్పింది ధరణి. రాత్రి వాళ్ళ బావ, మేనత్తా వచ్చారట. రాత్రంతా కాళ్లా వెళ్లా పడ్డాడు. "నువ్వు లేక పోతే బతకలే నన్నాడట, బుధ్ధి గడ్డి తిన్నదని" చెంప లేసుకున్నాడట. ఇక దాని మొహం చూడనన్నాడట. తను రాక పోతే ఆత్మహత్య చేసుకుంటా" నన్నాడట.

"వేషాలు" అన్నాను కసిగా.

"కాదు చెందూ. బావ మొహం చూస్తే అల్లా అనిపించట్లేదు. పాపం లంఖణాలు చేసినట్టు పీక్కుపోయింది మొహం." సానుభూతిగా అంటోంది ధరణి. జావగారి పోయిన లక్షణాలు దాని మోహంలో స్పష్టముగా కనిపించాయి నాకు.

"అయితే వెడుతున్న వన్న మాట." అన్నాను అయిష్టంగా. దాని నిర్ణయం నాకేం నచ్చల.

"మా అత్త ఏమన్నాదో తెలుసా?" పోరాడి మరీ జయించుకున్నావ్. వాడు నీ సొత్తు. ఎవరో కాకెంగిలి చేసిందని శాశ్వతంగా నీ బంగారాన్ని దానికే సొంతం చేసేస్తావా? తెలివి తక్కువ దాన. చేతనైతే దాన్నింకా వాడి వంక చూడకుండా మెడలు విరక్కొట్టు. వాడటు అడుగేయకుండా కొంగున మూడేసుకో. చాకచక్యమంటే అదీ" అంది. నిజమే కదా. బావ అందం అయస్కాంతం. ప్రతి ఇనప ముక్క అతుక్కు పోడానికే వెంపర్లాడు తుంది. దానికి దొరకనీడం నాదే లోపం. ఏమయినా గాని బావని ఇక దానికి అంద నీయను." పరిష్కారం దొరికిపోయినట్టు తేలిక పడిపోయి అన్నది ధరణి వెళ్ళటానికి లేస్తూ.

ఇక ఏం చెప్పి ఏం లాభం? ధరణి వెళ్ళిపోయింది.

వెడుతూ వెడుతూ నా చెయ్యి తన చేతిలోకి తీసుకొని బేలగా చూసింది ధరణి. "బావని వదలి నేనుండలేనే చందూ."

* * * *

ఈ మాటు భర్త మొహంలో పడి నా మీద సీత కన్నేయ లేదు ధరణి. అప్పటికింకా సెల్ ఫోన్ల యుగం రాలేదు. ఫోన్ బిల్ మినిమమ్ చార్జీలు మించితే మా బోటి మధ్య తరగతి వాళ్ళు గుండెలు బాదుకునే పొదుపు రోజులు. వారం పది రోజుల కొకసారి ఉత్తరమే రాస్తుండేది ధరణి నాకు .

అతను - పేరు వెంకట్రావనుకుంటాను - నీ సన్నిధి తప్ప అన్యం బెరుగ అన్నట్టుగా వుంది. "పాపం ఆ పాడు క్షణానికేదో మాయ కమ్ముకొచ్చి అలా తప్పటడుగు వేసేడే కానీ బావ పంచ ప్రాణాలు నేనేనే చందూ." అని రాసింది. ఆది మొదటి ఉత్తరం. రెండు మూడు కూడా

అదే సరళి - ఆ మాయలాడి వలలోంచి తప్పుకుని తిరిగి సతివ్రతుడయ్యాడన్న ఆనందం పొంగిపొర్లు తుండేది.

నాల్గో ఉత్తరం కాస్త ఆలస్యమైంది. పాతకథే కదా చదవక్కర్లేదనుకుంటూనే తెరిచాను. ఈ సారి స్వరం మారింది. అనుమానంగా వుందట. అవసరానికి మించి వలపు వరదలా ముంచెత్తిస్తూంటే భయంగా వున్నదట.

అప్పటి వరకు నా మనసుని తొలుస్తున్న సందేహమూ అదే. నిట్టూర్చాను. రెండు నెలలు ధరణి నించి ఏ సమాచారము లేదు. నేను రాసిన జాబుకి "పోరాడుతున్నాను." అని ఒక్క ముక్కలో సమాధానం ఇచ్చిందంతే. తననించి ఒచ్చిన ఆఖరి ఉత్తరమూ అదే.

మా అమ్మకి ప్రభావతి ఆంటీ - అంటే ధరణి అమ్మగారికి మాకు మల్లెనే మంచి దోస్తీ. ఆవిడకు కష్టం కలిగితే చెప్పుకునేందుకు సానుభూతితో వినగల ఓ మనసు కావాలి. అది మా అమ్మ దగ్గరుంది. అంచేత ధరణి నించి ఉత్తరాలు ఆగినా వార్త ప్రసారం మాత్రం ఆగలేదు.

* * * * *

ధరణి భర్తది నటన అని కొన్నాళ్లకి తేలిపోయింది. ఈసారతను బుకాయించలేదు. "అవును. నీకంటె ముందరిది. మా ఇద్దరి అనుబంధం ఇప్పుడు తెంచేసుకోటం నావల్ల కాదు." అన్నాడు తెగించినట్టు.

ధరణి కూడా మునపటిలా అలిగి పుట్టింటికి రాలేదు. 'నా హక్కుని అన్యాక్రాంతం కానివ్వను.' అన్నట్టుగా అక్కడే వుండి యుద్ధానికి దిగింది.

ఒక ప్రయోగం తరవాత ఇంకొకటి. ముందు బ్రతిమాలింది. "తాళి కట్టించుకున్నదాన్ని. నా కన్యాయం చెయ్యకు." అని ప్రాధేయ పడింది. "తాళి కట్టక పోతేనేమి, నన్నె నమ్ముకున్నది అది. నీకు అన్యాయం చేయను, తనకు చెయ్యలేను."అన్నాట్ట. అత్తతోనూ, స్నేహితులతోనూ హితోపదేశం చేయించింది. ఉహూ అతను తలకెక్కించు కోలేదు." ధరణి ఎంతో తనూ నాకంతే ముఖ్యం అన్నాడట మొండిగా.

అక్కడతో సౌమ్యత ఒదిలి పెట్టేసింది ధరణి. అతను ఇంటికి రావటం కాస్త ఆలస్యమైతే చాలు - "ఆ లం...... దగ్గరికే వెళ్ళావ్ కదూ!" అంటూ సభ్యత ఒదిలేసి వీధికెక్కి గోల చేయటం, జుట్టు విప్పుకుని తలబాదుకుని గగ్గోలు పెట్టటం- ఇంకా ఇంకా రెచ్చి పోయి అతగాణ్ణి రక్కెయ్య బోవటం, కొరకబోవడం-

తండ్రి వెళ్లి సమాధానపరచి తీసుకొద్దామని ప్రయత్నించినా రానన్నదట. తను అంతగా ప్రేమించిన వాడు, తన వాన్ని చేసుకున్నాననుకున్నవాడు తనకు కాకుండా పోతున్నాడన్న ఉక్రోషం, దుగ్ధ - ధరణిని పిచ్చి దాన్ని చేసేయి. ఆ అమ్మాయిని చంపేస్తానంటూ కత్తి తీసుకు బయలు దేరిందట ఓసారి. ఆ ఉన్మాదానికి పరాకాష్ట - ఆవేశం ఆక్రోశం కట్టలు తెంచుకున్న ఓ క్షణం - పరిగెత్తు కుంటూ వెళ్లి ఉరకలెత్తుతున్న కృష్ణలో దూకేసిందట ధరణి.

* * * * * *

అంతే ధరణి గురించి అంతవరకే తెలుసు నాకు. ఆ కబురు తెలిసి తల్లి తండ్రి గుండెలు బాదుకుంటూ వెళ్లిన వాళ్ళు రెండు నెల్లయినా తిరిగి రాలేదు. ఆత్రంగా ధరణికి రెండుత్తరాలు రాశాను. సమాధానం లేదు. వాళ్ల బంధువులు లెవరూ మాకు పరిచయంలో లేరు.

ఈ లోపల నాకు మ్యాచ్ సెటిల్ అయింది. అమ్మ వాళ్ళు పెద్ద ఇల్లు కావాలని కాలనీ ఒదిలి పెట్టేసారు. మొదట్లో చాలా బాధపడిన మెల్ల మెల్లగా ధరణి జ్ఞాపకాలు నా మనస్సులో మరుగాయిపోయాయి.

ఇన్నేళ్లకు తిరిగి ధరణి దర్శనం.

'ధరణి బ్రతికే ఉంది. ఏంతో సంతోషమనిపిస్తోంది. కాని పలకరించె లోపలే మాయమైందే! ఇంత సిటీలో ఎక్కడని వెతగ్గలను?' నిట్టూర్చాను.

ఆ విచారం ఎంతో సేపు నేననుభవించలేదు. నేను కూరలు కొని మార్కెట్ బయటకి వచ్చేటప్పటికి అక్కడ నుంచుని వుంది ధరణి గమ్మత్తుగా. నేను చూసినప్పుడే తనూ నన్ను చూసిందట. నెక్స్ట్ స్టాప్ లో దిగి వెనుకొచ్చి నా కోసం కాచుకునుంది.

"పద మా ఇంటికి." అంది ధరణి. తన మాటకెప్పుడూ ఎదురు చెప్పలేను. ఆటో లోనే ఒకరి గత చరిత్ర లోకరం చెప్పుకున్నాం. నాదేముంది. సింపుల్. పెళ్లి, పిల్లలు, వాళ్ల చదువులు పెళ్లిళ్లు. అంతే.

ధరణి జీవితమే వైవిధ్య భరితం.

ఆరోజు కృష్ణలో దూకి నప్పుడు జాలరి వాళ్లెవరో చూసి ఒడ్డుకి లాక్కొచ్చారట. ఏది మన చేతిలో లేదే చందూ." అన్నది ధరణి విరక్తిగా.

భర్త పదేళ్ల క్రితమే క్యాన్సర్ తో పోయాట్ట. ఇద్దరు కొడుకులు బాగానే సెటిల్ అయి పోయారు. కూతురు ఫారిన్లో వుంది. తను ఒక్కటే ప్రిత్రార్జితంగా ఒచ్చిన డబ్బుతో చిన్న ఇల్లోకటి కొనుక్కుని వుంటుందట.

ఇల్లు వచ్చేసింది. కాని దానికి తాళం లేదు. తలుపు తడితే గడి తీసిందొకామె.

"నా చెల్లెలు." కాలు గుమ్మంలో పెడుతూ నా ప్రశ్నర్ధకానీకి సమాధానం చెప్పింది ధరణి. నాకు తెలిసి తనకు తోబుట్టువులెవరూ లేరు.

"అంతా ఆలోచించొద్దులే. తను సావిత్రి. మా ఆయన తాళి కట్టని పెళ్ళాం. నా దగ్గరే వుంటోంది .

నాకు నోట మాట రాలేదు. నిర్ఘాంత పోవటం మన్నది చిన్న మాట.

"నిజమేనే చందూ!. ఆశ్చర్యం గానే ఉంటుంది. బావ వున్నన్ని నాళ్ళు కంట్లో నలక గా చూశాను తనని. ఇంటి దాక వెళ్లి తిట్ట రాని తిట్లు తిట్టొచ్చిన రోజులు కూడా ఉన్నాయ్. నోరెత్తేది కాదు పాపం.

అయినా జాలేసేది కాదు నాకు. తనని వదిలించటానికి ఎన్ని ప్రయత్నాలు చేసానో. ఓర్చుకుంది. తట్టుకుంది. తప్పు పక్కకి పోలేదు.

చివరిలో వ్యాధి ముదిరి బావ మంచం మీదే వున్నాడు. అప్పుడు వచ్చి ఒకసారి చూడనిమ్మని దేమళ్ళాడింది. గుమ్మం ముందు పడిగాపులు పడింది . పిల్లలు లోపలకి రానివ్వలేదు. రోజూ వచ్చి ఇంటి ముందే నించుని చూసి చూసి వెళ్ళేదట. నేనసలు పట్టించుకోలేదు. బావని శాశ్వతం గా తీసి కెళ్లి పోతున్న రోజు నేను చూశాను. విషాదానికి మారు పేరులా వుంది. చివరిసారి చూడనిమ్మని కాళ్లు పట్టుకుంటుంటె చిన్న వాడు కాళ్ల తోనే నెట్టేస్తున్నాడు. నా గుండె కలుక్కు మన్నదే చందూ - 'అప్పుడనిపించింది. ఒక్క తాళి బొట్టు మినహా నాకు తనకూ తేడా ఏముందని, తనకా దురవస్థ అని. కనీసం చివరి చూపు చూసుకునే అవకాశం మన్న ఇవ్వటం లేదే ఇది న్యాయమా?' అని.

ఇంతలో సావిత్రి వచ్చి మాకు మంచి నీళ్లందించి, కూరలు సంచితో తిరిగి లోపలికి వెళ్లిపోయింది.

వెడుతున్న సావిత్రి వంక సాలోచన గా చూస్తూ చెప్పింది ధరణి. నా కం టే ముందే బావ జీవితం లోకి అడుగు పెట్టింది. చివరి వరకు అతన్నే నమ్ముకు నుండి పోయింది. ఏం బావుకున్నదని - వుంచుకున్నది అన్న నీచమైన బిరుదు తప్ప. నలుగురిలో ఓ గౌరవం లేదు. మర్యాద లేదు. తన అత్తెసరు సంపదనలో బావ ఆమెకు మేడలు మిద్దెలు కట్టించలేదు. జాగ్రత్తలు తీసుకునే వాడేమో బావ - కనీసం పిల్లలన్నా లేరు తోడుకి.

బావకేం సరదాలకి ఒకరు, సంప్రదాయానికి ఒకరు అన్నట్టుగా హాయిగా గడిపేసాడు. తన దారిన తను వెళ్లి పోయాడు. నా కన్యాయం చేస్తోందని దాని మీద కక్ష పెంచుకున్నానే గాని ఇద్దరి జీవితాలతో ఆడుకున్న బావని కద నేను కోపగించు కోవాలిసింది?

అసలు అన్యాయం జరిగింది సావిత్రికి. తను నా అన్నవాళ్ళు లేని అనాధ అని నాకు తెలుసు. ఆధారమనుకున్నవాడు ఎగిరిపోయాడు. నా అన్న తోడు లేకుండా, ఏ ఆసరా లేకుండా, లోకులు సానుభూతన్నా నోచుకొని ఈ పిచ్చిది రేపట్నించి ఎలా బతుకుతుందా? అనిపించిందే చందూ.

అందుకే పిల్లల మాట తోసి పుచ్చి లోపలికి రమ్మన్నాను. ఆ తర్వాత కూడా నాతోనే వుండి పొమ్మన్నాను. ఇన్నేళ్లు చింతా, చీకాకులు తోనే బతికాం. ఇప్పుడన్న ప్రశాంతంగా గడుపుదాం అన్నాను.

పిల్లలకి నచ్చలేదు. అలిగేరు. ఎప్పుడో గానీ రారు. పరవాలేదు. నేను సరైనది అనుకున్నది ఎవరు కాదన్నా మాననని నీకు తెలుసుగా! ఆపింది ధరణి.

తెలుసు. తను ధరణి. ఆగ్రహమొస్తే బద్ధలయి మింగేసేటంత క్రోధం చూపించగలదు. ఆదర మొస్తే ఓర్పుకీ, సహనానికీ, త్యాగానికీ మారుపేరవగలదు. అవును తను ధరణి.

** సమాప్తం.**